# రబ్బిష్

**ఎన్నికలయిపోయాయి.** నగరంలో అనేక ప్రాంతాలు సర్కస్ గుడారం ఎత్తేసిన మర్నాటిలా ఉన్నాయి. ఇంకా రోడ్లకి అటూ ఇటూ గాలికి ఒరిగిపోయి చిరిగిపోతూ ముఖ్యమంత్రీ, ప్రధాన మంత్రీ, గాంధీ, నెహ్రూలతో సహా ఊగిపోతూ పడేస్థితిలో తాళ్లకి వేలాడుతున్నారు. నాలుగంతస్తుల అపార్ట్‌మెంట్ పక్కన ఖాళీ స్థలంలో ఎన్నికలకి దూరంగా ఓ మూల తాటాకింట్లో ఉంటుంది బీ. ఆమెతోపాటు పక్కనే గడ్డిమేటు. దాని కవతల నాలుగు గేదెల పాడితో పాలవ్యాపారం చేసే కుటుంబం. బీ తెల్లగా పాలిపోయి ఉంటుంది. ఇద్దరు భర్తలు పీల్చి పిప్పి చేసి ఒదిలేసిన శరీరంతో అపార్ట్‌మెంటు ఇళ్లలో పనిచేస్తుందామె. మధ్యలో ఎప్పుడు బుద్ధి పుడితే అపార్ట్‌మెంట్ల వాచ్‌మెన్ జొరబడుతూంటాడు. మస్తాను నిజానికి ఇద్దరు భర్తలకీ పుట్టలేదు. అపార్ట్‌మెంటు కట్టిన మేస్త్రీ బీని తాడేపల్లిగూడెం నుంచి రెండోభర్త యాజమాన్యం విడిపించి తీసుకొచ్చేడు. అపార్ట్‌మెంట్లు పూర్తయ్యేసరికి బీ కడుపుతో ఉంది. రెండువేల రూపాయలు ఆమె చేతిలో పెట్టి మళ్లీ కనిపించలేదు మేస్త్రీ.

బీ పనిలోకి వెళ్తూ మస్తాన్‌ని లేపి వెళ్లింది. ఒక్క ఉదుటున లేచేడువాడు. నీళ్లు పుక్కిలించి వేడి టీ తాగేసరికి లేత ఎండ గడ్డిమేటు మీద పడింది. వాడి గుండె దడదడలాడింది. డబ్బాతో నీళ్లు తీసుకుని బయటికి పరిగెట్టేడు. వాడి వృత్తి నియమ నిబంధనల ప్రకారం రెండు చెత్త కుండీల మీదా బొగ్గుతో ఇంటూ గుర్తు పేట్టేడు. కానీ మస్తాను పదకొండేళ్ల వీధి జీవితం కొన్ని ప్రాథమికసత్యాల్ని నేర్పింది. అందులో మొదటిది ఏ వృత్తిలో అయినా బాగా ఒళ్లు కొవ్విన వాడి మాటేచెల్లుతుంది. చివరిమాట కూడావాడిదే. రెండోది కుండీల ఇంటూ మార్కులైనా రూల్సయినా అందరికీ సమానంగా వర్తించవు. ఈ జ్ఞానం వాణ్ని నిన్నట్నించీ ప్రత్యేకంగా ఇబ్బంది పెడుతోంది. కొత్త పేట డబ్బున్నవాళ్లూ డబ్బు చేసుకుంటున్న వాళ్లూ ఉండే ప్రాంతం. మెయిన్‌రోడ్డు అందుకే శుభ్రంగా ఉంటుంది. అక్కడి మురుగునీటికాలవ కూడా శుభ్రంగానే ఉంటుంది. ("ఏరా నిన్న రాలేదేం? కమీషనర్‌కి ఫోన్ చెయ్యనా?") మెయిన్ రోడ్డుకి తూర్పున చీలిన నాలుగు రోడ్లలో ఒప్పందం ప్రకారం రెండు సత్తివీ రెండు మస్తానువీ. తాత్కాలికమైన ఈ ఒప్పందంమేరకు పదమూడేళ్ల సత్తిగాడూ మస్తానూ ఒకటీ బై రెండు టీ తాగి ఒకటీ బై రెండు సిగరెట్టు కాల్చి కుండీల

మీద ఇంటూ గుర్తులు పెట్టుకున్నారు. పోలింగు అయిపోయిన మర్నాడు ఎవరి కుండీ వారిదే. మెయిన్‌రోడ్డులో నాలుగు ఎన్నికల కార్యాలయాలున్నాయి. పదిరోజులపాటు మస్తానూ సత్తీ ముఖ్యమంత్రినీ, ఎంపీగార్నీ, ఎమ్మెల్యేగార్నీ ఇతర రాష్ట్ర, జాతీయ నాయకుల్నీ గొడలకి అతికించేరు. పోస్టర్‌కి ఇరవై పైసలచొప్పున బేరం కుదిరినా గరాటాలోంచి డబ్బు కిందికి జారేసరికి సగానికి సగం దక్కలేదు. రెండ్రోజుల్నించీ నాయకులూ, మంత్రులూ, సినిమా తారలూ, ప్రాజెక్టులూ చెత్తకుండీల్లో ఉండిపోయాయి.

గోనె సంచీ భుజాన తగిలించుకుని మస్తాను పరుగులాంటి నడకతో సూర్యుడితోపాటు కొత్తపేట బయల్దేరేడు. వాడు సత్తిని ఎప్పుడూ నమ్మలేదు. వాడు తనకంటేపొడుగు. కాలితో చేత్తో తన్నడం వాడికిష్టం. మస్తాను భుజం మీదచెయ్యి పడేసి నడుస్తాడు సత్తి. ఆగడం, నడక వేగం పెంచడం వాడి ఇష్టం. ఒంటేలు పోసేటప్పుడు కూడా ఒక చెయ్యి మస్తాను భుజం మీదే ఉంటుంది. ("రేయి, నాది కింగు సిగరెట్టురా చూడు") వాడి చేతికింద మస్తాను భుజం పడి ఉండడం కూడా వాడికిష్టం. వాడికి మరీ ఇష్టమైన పందెం ఒకటి ఎన్నికల సమయంలో ఆలోచించాడు. రెడ్డిగారింటి వీధిలో కాలవ వెనక గోడ మీద రంగుల వాల్‌పోస్టర్ అతికించేరు. గోడకి బాగా కింది భాగంలో కాలవ రక్షగా నమస్కారం పెడుతున్న సినిమా తార రంగులబొమ్మ. భారతీయుల జీవితాలు బాగుపడాలంటే ఎంపీ అభ్యర్థికే ఓటు వెయ్యాలని బొమ్మకింద వాక్యం. ఆమెని చూస్తూ భుజం మీద చెయ్యి అలానే ఉంచి పందెం కట్టేడు సత్తి. ఇద్దరూ కలిసి ఒకేసారి సరిగ్గా సినిమాతార నడుంమీద ఎవరు ఎక్కువ సేపు ఒంటేలు పోస్తారో వాడికి రెండోవాడు టీ ఇప్పించాలి. ఆమెని ఎక్కువగా దీక్షగా సూటిగా సత్తిగాడే తడిపేవాడు. ఓ రోజు రెడ్డిగారి భార్య మేడ మీంచి చూసి తిట్టేవరకూ రోజూ సినిమా తార తీవ్రంగా తడుస్తూనే ఉంది.

అందుకనే సత్తిగాడి ఇంటూ న్యాయంమీద మస్తానుకి నమ్మకం లేదు. కనీసం రెండు బస్తాల కాయితాలు, విస్కీ, బీరు సీసాలు కుండల్లో దొరుకుతాయని వాడికి బాగా తెలుసు. పంట కొచ్చిన పొలాన్ని చూసి మురుసుకుపోయే రైతులాగ నిండి పోయిపొర్లుతున్న కుండీలని చూసుకోవాలని మస్తానుకి రాత్రి నిద్ర పట్టలేదు. నాలుగు నెలలు చెత్తకుండీలు దేవినా అన్ని పైసలు రావు. ఆందోళన, సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతూ తన ముందే అనవసరంగా పడున్న సగం కాలిన కింగ్‌సైజు సిగరెట్టుని కూడా పట్టించుకోకుండా నడిచాడు వాడు. సందు మలుపు తిరిగి ఆ మిగతా గజాలు పరుగున చెత్తకుండీ దగ్గిరికి వెళ్లేడు మస్తాను. ఆ పెన్నిధిచూస్తూనే ఆగిపోయాడు. వాడు అనుకున్నట్టు అది పూర్ణకుంభంలా లేదు. సత్తి ముందే వచ్చి వెళ్లేడని తెలిసిపోతోంది. ఎమ్మెల్యే, ఇద్దరు జాతీయ నాయకులూ ఒక ప్రతిపక్ష నాయకుడూ కలిసి మెలిదిరిగి పోయి నడుం భాగం

నుంచీ కుండీలోంచి వేలాడుతున్నారు. ముఖ్యమంత్రీ, ఎంపీగారూ అవతలి వేపు తలకిందులుగా పడున్నారు. చూడగానే వాడికి బొడ్డులోంచి ఏడుపూ ఆరడగుల కసీ తన్నుకొచ్చేయి. సత్తిగాణ్ని పచ్చి బూతులు తిడుతూ గబగబ సంచీలోకి నాయకుల్నీ జండాల్నీ కుక్కుతున్నాడు.

"ఏరా, ఇప్పుడొచ్చేవేటీ?"

బరువైన గోనె సంచీ మూతి ముగించి కిందికిజారుస్తూ అడిగేడు సత్తి. వాడి నవ్వూ వాలకం చూడగానే మస్తానుకి అర్థవైపోయింది. కోపం ఏడుపూ కలిసిన బూతుల్తో మొదలు పెట్టేడు.

"నా కొడకా నా కాయితా లెందుకు తీశావురా?"

సత్తి ముందు సోదరభావంతో "నేనెప్పుడు తీశాన్రా లంజోడకా?" అన్నాడు. తరవాత "నువ్వు చూసేవంటరా?" అన్నాడు.

"సకానికి సకం దొబ్బేవు. నా కొడకా సంచిప్పు."

ధర్మాగ్రహంతో మస్తానుకి సత్తి చెయ్యి ఎప్పుడూ తన భుజం మీద ఉండేదనీ అన్ని రకాల పందేలలో ఎప్పుడూ ఓడిపోతాననీ గుర్తు రాలేదు. రెండు అంగల్లో సత్తి గోనె సంచీలాగి మూతి విప్పబోయాడు. అలవాటు ప్రకారం సత్తి కాలితో ఒక్క తన్ను తన్నేడు. 'అయ్యో' అని పడబోయి లేచి విసురుగా సత్తి పొట్టమీద తలతో కుమ్మేడు మస్తాను. వాడి జుట్టు లంకించుకున్నాడు సత్తి. ఇద్దరూ తిట్టుకుంటూ పెనుగులాడుతున్నారు. దెబ్బకో బూతు చొప్పున ఆడినమాట ఆడకుండా తిట్టుకుంటున్నారు. ఒకళ్ల చొక్కా ఒకళ్లు చింపుకునే ప్రయత్నంలో ఉండగారోడ్లు తుడిచే ఈరబాబు చూశాడు.

ఒక చేతిలో పొడవాటి కఱ్ఱ చీపురూ ఒక చేతిలో గుడ్డచుట్టిన కఱ్ఱ చిన్న కాగడాలా మండుతోంది. కఱ్ఱ తీసుకుని ఇద్దరి కాళ్ల మీదా వడ్డించాడు ఈరబాబు. ఇద్దరూ ఒగరుస్తూ విడిపోయారు.

"ఒళ్లుగాని దూలెక్కిందా? ఏట్రా అది?"

మస్తాను ముందు కోలుకున్నాడు. ఏడుస్తూ అన్నాడు.

"కాదన్నా ఈడి కుండీ ఏరే ఉంది. ముందొచ్చి నా కుండీలో కాయితాలన్నీ దొబ్బేడు నా కొడుకు. చూడన్నా ఆడి సంచి."

"ఏరా?"

"అంతా ఉత్తదే గురూ. ఈడిప్పుడే ఒచ్చాడు. కలబడింది ఈడే."

"నీ యమ్మ. మీ పని ఇలాగ్గాదు. ఇప్పంట్రా సంచీలిప్పి కుండీలో ఎయ్యండి. తీ లంజోడకా"

మస్తాను దణ్ణం పెట్టేడు. "అన్నా అన్నా, నన్నొదిలెయ్యన్నా. ఎళ్లిపోతా అన్నా."

కర్రెత్తేడు ఈరబాబు. ఇద్దరూ కష్టపడి పార్టీల్నీ , ఇండిపెండెంటు అభ్యర్థుల్నీ, కాగితం జెండాల్నీ, నాయకుల్నీ, ప్లాస్టిక్ గ్లాసుల్నీ, విస్కీ బీరు సీసాల్నీ కుండీలో పోశారు. పొర్లిపోయింది. కుండీ. మస్తానుకి ఏడుపు ఆగడంలేదు. ఈరబాబు ముందు కుండీలో తరవాత చుట్టూరా కాయితాలకీ చేతిలో కాగడాతో నిప్పుపెట్టేడు. బాగా ఎండి ఉన్నాయేమో ఒక్కసారి భగ్గుమన్నాయి.

❖ ❖ ❖